మొక్కలకు చలువ పందిళ్లు!

- మొక్కలు నాటేందుకు చర్యలు
- మండల వ్యాప్తంగా లక్షా 95 వేల లక్ష్యం

కుంటాల: పల్లెల్లో పచ్చదనం పెంపొందించేందుకు గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టింది. ఇందులో భాగంగా నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు పెంచుతోంది. పండ్ల మొక్కల తోపాటు పలు నాటి సంరక్షణ చర్యలు చేపడుతోంది. పదోవిడత హరితహారంలో భాగంగా అధికారులు నర్సరీల్లో మొక్కలను బాధ్యతాయుతంగా పెంచుతున్నారు. మండలంలోని 15 పంచాయతీల పరిధిలో నర్సరీలు ఏర్పాటు చేశారు. అందులో వివిధ మొక్కలు పెంచుతున్నారు. అవి ఎండిపోకుండా వేసవి దృష్ట్యా ముందు చర్యలు చేపడుతున్నారు. నర్సరీల్లో మొక్కలపై చలువ పందిళ్లను (గ్రీన్‌మ్యాట్స్) రక్షణ కోసం వేయిస్తున్నారు. చలువ పందిళ్ల కోసం ఒక్కో నర్సరీకి రూ.3 వేల నిధులు కేటాయించింది.

మొక్కల సంరక్షణకు చర్యలు

నర్సరీల్లో మొక్కల సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ప్రతీ నర్సరీలో జీవామృతం తయారు చేయిస్తున్నారు. మొక్కలు చనిపోకుండా ఆరోగ్యంగా ఉండేందుకు సేంద్రీయ ఎరువులను వినియోగిస్తున్నారు. ఎండ తీవ్రత కోసం నర్సరీల పైభాగాన చలువ పందిళ్లు వేయించారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కలు వాడిపోకుండా నీళ్లను పట్టిస్తున్నారు.

హరిత మండల దిశగా..

వర్షాలు సమృద్ధిగా కురవాలని, వాతావరణ సమతుల్యత కాపాడేందుకు, పల్లెలు పచ్చదనంతో ఉండాలన్న లక్ష్యంతో హరితహారానికి శ్రీకారం చుట్టారు. కుంటాల మండలంలోని ఏర్పాటుచేసిన 15 నర్సరీల్లో లక్షా 95 వేల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇందులో భాగంగా పండ్లు, పూలు, నీడనిచ్చే తదితర మొక్కలను నాటించారు. జామ, దానిమ్మ, సీతాఫలం, ఖర్జూర, అల్లనేరేడు, నేరేడు, వెలగ, చెర్రీ, ఉసిరి పండ్ల, గులాబీ, మందారం ముద్దమందారం, చక్రం, నందివర్ధన, గన్నేరు, మల్లె, కాగితం పూలు, వేప, టేకు, కానుగ, నీలగిరి, రావి, సరుగుడు, బేల్ పత్రి, గోరింటాకు, కరివేపాకు, మునగ తదితర అన్నిరకాల మొక్కలను నాటి నీటిని పడుతున్నారు. వేసవిలో ఎండిపోకుండా చలువ పందిళ్ల (గ్రీన్‌మ్యాట్స్) ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టారు.


వెంకూర్ నర్సరీలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు


అందాకూర్‌లోని నర్సరీ

చర్యలు చేపట్టాం



నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు చర్యలు చేపట్టాం. వేసవి దృష్ట్యా ఎండిపోకుండా గ్రీన్ మ్యాట్స్ ఏర్పాటు చేయించాం. హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం.
– గట్టుపల్లి నవీన్, ఏపీవో

సీసీరోడ్ల పనులు ప్రారంభం


జామ్‌లో పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీలు

నిర్మల్: సారంగాపూర్ మండలంలోని పెండల్‌దరి దారిలో, జామ్ గ్రామంలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్ల పనులను జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ ఆడె సవితాబాయి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, మండల కన్వీనర్ నర్సయ్య, నాయకులు విలాస్‌రావు, ఓలాత్రి నారాయణరెడ్డి, రాజారెడ్డి, భూమన్న ఉన్నారు.

నిర్మల్: సారంగపూర్ మండలం నాగాపూర్ తండాలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను బీజేపీ నాయకులు శనివారం ప్రారంభించారు. బీజేపీ మండల అధ్యక్షుడు విలాస్, నాయకులు గంగారెడ్డి, రాజేందర్ రెడ్డి, వీరయ్య, చంద్రప్రకాశ్‌గౌడ్, రాజు, తిరుమల చారి, మహేశ్‌రెడ్డి, బడిపోతన్న, సాహెబ్‌రావు తదితరులు ఉన్నారు.


కుంటాల: పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ కట్ట రవి

కుంటాల: ఓలా గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.2 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ కట్ట రవి ప్రారంభించారు. మాజీ వార్డు మెంబర్లు నాలం రాధ, రామగిరి కృష్ణ, నాయకులు సాయినాథ్ పటేల్, సాయన్న, కమల్, వేముల సాయికుమార్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ముధోల్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామాలకు చెందిన 82 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే రామరావుపాటిల్ శనివారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. మిగతా వారికి త్వరలో చెక్కులు అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. తహసీల్దార్ విఠల్, ఎంపీపీ ఆయేషా అఫ్రూజ్‌ఖాన్, ఎంపీటీసీ భూమేష్, బీజేపీ నాయకులు రమేశ్, పోతన్న, ఎస్.పోతన్న, గంగయ్య, నాయకులు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

క్లుప్తంగా

ముగిసిన హరినామ సప్తాహం


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

ముధోల్: మండల కేంద్రంలోని పశుపతినాథ్ ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గత ఏడు రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం శనివారం ముగిసింది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శివాలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయంలో ఎమ్మెల్యే రామారావు పటేల్ పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా ఏర్పడిన రంగుల రాట్నంలో పిల్లలు, యువకులు, కేరింతలు వేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఇష్టారీతిన కలప తరలింపు!


ట్రాక్టర్‌లో రాత్రివేళ తరలుతున్న నాన్‌టేక్ కలప

భైంసాటౌన్: పట్టణంలోని పలు సామిల్లులకు ఇష్టారీతిన కలప(నాన్‌టేక్) తరలుతోంది. డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాల నుంచి రాత్రివేళల్లో ట్రాక్టర్లలో కట్టెల దుంగలు తరలిస్తున్నారు. గతంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు అనధికారికంగా తరలిస్తున్న కలప ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. స్థానికంగా ఉండే అధికారులు పట్టించుకోవడంతో రాత్రి వేళల్లో ఇలా అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా కలప తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత


కవితకు చెక్కు అందజేస్తున్న సభ్యులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన శాతం భీమన్న కుటుంబానికి వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం రూ. 50 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న తెలంగాణలోని 100 మంది పేద, రైతు కుటుంబాలకు ఆర్థికసాయాన్ని హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో గల పీఎస్‌ఎమ్ హైస్కూళ్లో అందజేశారు. మస్కాపూర్‌కు చెందిన కుటుంబానికి సేవాసమితి అధ్యక్షుడు హనుమంతరావు, కిసాన్ జాగరణ్ అధ్యక్షుడు సుగుణాకర్ భీమన్న భార్య కవితకు రూ.50 వేల చెక్కు అందించినట్లు బీజేపీ నాయకులు దాదె మల్లయ్య, తిరుమలగిరి, ఉపేందర్ తెలిపారు.

వైభవంగా పల్లకిసేవ


పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవరకోట దేవస్థానంలో పల్లకిసేవ శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు చేపట్టి, వివిధ రకాల పూలతో అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆమెడ శ్రీధర్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పరామర్శ


మునిపెల్లిలో పరామర్శిస్తున్న శ్రీహరిరావు

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లికి చెందిన నూతి కాడి రాజారెడ్డి, గురాల లింగారెడ్డి అమ్మమ్మ లక్ష్మి, లక్ష్మణచాందకు చెందిన భీమేష్ మలేషియాలో ఇటీవల మృతి చెందారు. డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు శనివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. భీమేష్ కుటుంబాన్ని ఓదార్చారి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. అనారోగ్యంతో మృతిచెందిన అప్పని నారాయణ కుటుంబాన్ని, మొగ్గం లింగన్న కుటుంబాన్ని పరామర్శించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, నాయకులు ఈటెల శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, నరేశ్ రెడ్డి, గంగాధర్‌గౌడ్, నారాయణ ఉన్నారు.

నువ్వుల సాగుతో అధిక దిగుబడి

- పసుపు వేసిన నేల ఈ సాగుకు అనుకూలం
- రైతులకు సలహాలు అందిస్తున్న ఏవో గణేశ్

లోకేశ్వరం: యాసంగిలో ఆరుతడి పంటలనే సాగు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. యాసంగిలో నువ్వుల పంట సాగు చేసుకుంటే దిగుబడి సాధించవచ్చని ఏవో గణేశ్ పేర్కొంటున్నారు. ఈ సాగుపై రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. యాసంగిలో నువ్వు పంట విత్తు కోవాలి. అధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు పంట కాతకు, పూత దశ చేరుకుంటే పంట దిగుబడి తగ్గుతుంది. ఎండలు ముదరకముందే పంట కాత పట్టే విధంగా విత్తు కోవాలి. యలమంచిలి, రాజేశ్వరి, శ్వేతతిల్, చందన, హిమాలాంటి రకాలు అనుకూలంగా ఉంటాయి. నువ్వుల పంటలో తక్కువ నీటితో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చు. పసుపు పంటను తవ్విన నేలల్లో అధికంగా నువ్వుల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

యలమంచి: 75–80 రోజుల పంట. బూడిద తెగుళ్లను తట్టుకుంటుంది. నూనె 53 శాతం కలిగి ఉంటుంది.

రాజేశ్వరి: 75–80 రోజుల పంట. తెల్లరకం గింజు ఉంటుంది. కాండం కుళ్లు, బూడిద తెగుళ్లను తట్టుకుంటుంది. నూనె 50 శాతం ఉంటుంది.

శ్వేతాతిల్: ఈరకం 80–85 రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరాకు 4–5 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. 53 శాతం నూనె కలిగిన తెల్ల రకం గింజకాయ తొలిచే పురుగు, కాండం కుళ్లు తెగులును కొంతవరకు తట్టుకుంటుంది.

చందన: 85 రోజు పంట వెర్రితల తెగులును తట్టుకుంటుంది.

హిమ: 75–80 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఎకరాకు 3.5 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. 51 శాతం నూనె కలిగిన పొడవాటి గింజలు ఉంటాయి. కోడు ఈగను, వెర్రితెగులును తట్టుకుంటుంది. శ్వేతాతిల్, హిమ వంటి తెలుపు రంగు గింజలకు విదేశాల్లో డిమాండ్ ఉంటుంది. దీంతో మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది.


లోకేశ్వరంలో నువ్వుల సాగు

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి 3గ్రాముల థ్రాప్తాన్ లేదా 1 గ్రాము కార్బండిజమ్ లేదా 2.5 గ్రాముల మాంకోజెబ్‌లో విత్తనశుద్ధి చేయాలి.

ఎరువుల యాజమాన్యం..

నువ్వు పంటలో అధిక దిగుబడి సాధించాంటే హెక్టార్‌కు 5–10 టన్నుల పశువుల ఎరువులు వేసుకోవడం మంచిది .రసాయన ఎరువులు 24 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 16 కేజీ పొటాష్ నిచ్చే ఎరువులు వేయాలి.

నీటి యాజమాన్యం:

విత్తిన వెంటనే మొదటి తడి ఇవ్వడం వల్ల మొలక బాగా వస్తుంది. తర్వాత సున్నితదశ లైన పూత కాయ దశల్లో నీరు అవసరం అధికంగా ఉంటుంది. విత్తిన 30–40 రోజుల వరకు పంట పూతకు వస్తుంది. కాయలు గింజలు గట్టిపడటానికి 70 రోజుల సమయం పడుతుంది. మధ్యకాలంలో నేలలో తగినంత తేమ ఉంటే దిగుబడి బాగుంటాయి.

కలుపు నిర్మూలన:

తడి నేలపై విత్తిన 48 గంటల్లోపు అలాక్లోర్ లేదా పెండిమిథాలిన్ 5 మిల్లీలీటర్ల లీటరు నీటికి కలిపి ఎకరాకు 200 లీటర్ల ద్రావణంలో పిచికారి చేయాలి.

ఆలయాల్లో అన్నదానాలు, పూజలు

ఖానాపూర్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లోని శివాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ప్రత్యేక జాగరణతోపాటు లింగోద్భవం, తదితర పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు హాజరై పూజలు చేశారు. పట్టణంలోని సాయినగర్‌లోని మార్కండేయ, అన్నపూర్ణ మహాదేవ ఆలయాల్లో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, వైస్ చైర్మన్ సంతోశ్‌ను సన్మానించారు.

భైంసాటౌన్: పట్టణంలోని శివాలయాలకు శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా ఆలయాల్లో పూజలు చేశారు. ఆయా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద పంపిణీలో పాల్గొని ఉపవాస దీక్షలు విరమించారు. కిసాన్‌గల్లి మహాదేవ్ మందిర్, సిద్దార్థనగర్‌లోని ఓంకారేశ్వర, పాతాలేశ్వర ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

భైంసారూరల్: ఉపవాస దీక్షలో ఉన్న భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సిరాల, చుచుంద్, మహాగాం, వానల్‌పాడ్, సుంక్లి, చింతల్‌బోరి గ్రామాల్లో మహాదేవ్ మందిరాల్లో పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో ఉపవాస దీక్షలు విరమించారు.

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. అనంతరం ఉపవాస దీక్షను భక్తులు విరమించారు.


ఖానాపూర్‌లోని ప్రసాన్నాంజనేయ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నిర్మల్ ఏరియా ఆసుపత్రి వైద్యుడు వేణుగోపాలాక్రిష్ణ పూజలు అనంతరం ఆయన్ను ఆలయ కమిటీ, పోలీసులు పన్మానించారు. శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఎంపీపీ పద్మ దంపతులు, జెడ్పీటీసీ రాజేశ్వర్ శనివారం పూజలు చేశారు.

నిర్మల్‌టౌన్: పట్టణంలోని పలు ఆలయాల్లో ఉపవాసంలో ఉన్న భక్తుల కోసం శనివారం అన్నదానం నిర్వహించారు.

తానూరు: మహాశివరాత్రి ఉపవాస దీక్ష ముగింపు రోజు కావడంతో ఆలయాల్లో భక్తులు శనివారం పూజలు నిర్వహించారు. భోసిలో భైంసాకు చెందిన సితారాం షేట్ కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. బోరిగాంలోని మహాదేవున్ని, ఎల్వి గ్రామంలోని రఘునాథ్ ఆలయాల్లో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ శ్రీ రాజరాజేశ్వరాలయం, కుంటాలలోని శ్రీ మహాదేవ, ఉమామహేశ్వర, ఆత్మలింగం, ఓలా, దౌనెల్లి, పెంచికల్ పాడ్ శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. శుక్రవారం రాత్రి భజన చేస్తూ భక్తులు జాగారణ చేశారు. శనివారం ఆలయంలో పూజలు అనంతరం ఉపవాస దీక్షలు విరమింపజేశారు. కుంటాల మహాదేవుని ఆలయంలో ఎఫ్ఎస్‌వో రాజేందర్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ముధోల్: బాసర మండలం కిర్గుల్‌బి గ్రామంలోని లింగంగుట్ట శివాలయాన్ని మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.


నిర్మల్‌టౌన్: నాగరేశ్వరవాడ ఆలయంలో దర్శనానికి క్యూ కట్టిన భక్తులు


కుంటాల మహాదేవ ఆలయంలో భక్తుల పూజలు


భైంసాటౌన్: కిసాన్‌గల్లి మహాదేవ్‌మందిర్‌లో అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే రామారావు పటేల్

లోకేశ్వరం: మండలంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కారిస్తామని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. స్థానిక రైతువేదికలో శనివారం 104 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సేవ చేస్తామన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వంద రోజుల్లో నియోజకవర్గంలో రూ.100 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. పంచగుడి నుంచి ముథోల్ వరకు రోడ్డు నిర్మించేందుకు రూ.48 కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. పిప్రి ఎత్తిపోతల పథకానికి రూ.20 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోతీరాం, ఎంపీడీవో సోలమాన్‌రాజ్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రావు, ఎంపీటీసీ సభ్యులు జయసారగ్‌రావు, జీవన్, దత్తురాం పటేల్, నాయకులు సుమాన్‌కుమార్, శ్రీధర్, రమేశ్, బద్దం గంగారెడ్డి, శంకర్‌గౌడ్, గన్ను నర్సారెడ్డి, వెంకట్‌రెడ్డి, మంద భాస్కర్, మంద గణేశ్, చిన్నరావు, సాయన్న, సాయాగౌడ్, పోతన్న, సంజీవ్‌రెడ్డి, అనిల్, సాహేందర్, భూమన్న పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

‘బడుల’ దారిలో బ్రేకులు వేయరా!

నిర్మల్: జిల్లాకేంద్రంలో ఈద్‌గాం నుంచి సిద్దాపూర్ వెళ్లేదారిలో ఒక్క స్పీడ్‌బ్రేకర్ కూడా లేదు. ఇదేమార్గంలో ఈద్‌గాం చౌరస్తా నుంచి సిద్దాపూర్ వరకూ విన్నర్స్, బ్లూమింగ్‌బర్డ్స్, వశిష్ఠ, శ్రీచైతన్య, అల్ఫోర్స్ వంటి ప్రముఖ పాఠశాలలు ఉన్నాయి. నిత్యం ఉదయం, సాయంత్రం వందలాదిమంది విద్యార్థులు ఈ మార్గంలో వెళ్తుంటారు. పదుల సంఖ్యలో స్కూల్‌బస్సులు నడుస్తుంటాయి. ఇలాంటి రోడ్డుపై ఎక్కడా ఒక్క స్పీడ్‌బ్రేకర్ కూడా లేదు. కనీసం పాఠశాలల వద్దా వేయలేదు. ఈమార్గంలో యువకులు బైకులపై రయ్..మంటూ దూసుకుపోతున్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కాలనీవాసులూ బెంబేలెత్తుతున్నారు. వెంటనే ఈ మార్గంలో స్పీడ్‌బ్రేకర్‌లు ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.


స్పీడ్‌బ్రేకులు లేని ఈద్‌గాం-సిద్దాపూర్ రహదారి

ఆలయంలో రుద్రహోమం

కడెం: మండలంలోని ఎలగడప, పాత మద్దిపడగ, కొత్తమద్దిపడగ, మాసాయిపేట్ సమీపంలోని అంగడీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం కుంకుమపూజలు, రుద్రహోమం నిర్వహించినట్లు ఆలయకమిటీ అధ్యక్షుడు రాజేందర్ పేర్కొన్నారు. ఆలయకమిటీ అధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సంక్షిప్తంగా

ఎస్సైకి సన్మానం

కడెం: ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన కృష్ణసాగర్‌రెడ్డిని బీసీ యూత్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొదాని రమణయాదవ్, పలువురు గ్రామస్తులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైని సన్మానించారు. మహేశ్, వెంకటేశ్, మహేశ్, శేఖర్, సృజన్ తదితరులు ఉన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

భైంసాటౌన్: పట్టణంలోని నర్సింహానగర్‌లో గల నర్సింహా కల్యాణ మండపంలో ఆదివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు ఎమ్మెల్యే రామారావుపటేల్ చేతులమీదుగా భైంసా మండల పరిధిలోని లబ్ధిదారులకు చెక్కులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

తానూరు: స్థానిక రైతు వేదిక కార్యాలయంలో ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ ఆదివారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేస్తారని తహసీల్దార్ లింగం మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 106 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

కుభీర్: తహసీల్దార్ కార్యాలయంలో గ్రామాలకు చెందిన 135 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే రామారావ్ పటేల్ ఆదివారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తారని తహసీల్దార్ ఎం.సోము తెలిపారు. ఉదయం 11 గంటలకు చెక్కులు అందిస్తారని పేర్కొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సీనియర్ వైద్యురాలు పడకంటి రమాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

కుభీర్: కుభీర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ అజీజొద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్లకొమ్మలు తొలగిస్తున్నందున ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.


ఆలయ అభివృద్ధికి విరాళం


విరాళం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి లింగాపూర్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.15 వేల నగదును విరాళం అందజేశారు. గౌరవ అధ్యక్షుడు దానవేని మల్లేశ్, అధ్యక్షుడు బొమ్మడి మహేశ్వర్, కుర్ర దజ్జయాదవ్, గంగారాం, తుమ్మ నరేశ్, కుర్ర గంగాధర్, రాకేశ్, నవీన్, నరేశ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్న రాజన్న, స్వామి, లక్ష్మణ్, రాజేందర్ ఉన్నారు.

ప్రజాభిప్రాయాల స్వీకరణ

లోకేశ్వరం: మండల కేంద్రంలోని బీజేపీ ఆధ్వర్యంలో మేనిఫెస్టో రూపకల్పనలో భాగంగా ప్రజాభిప్రాయాలను పార్టీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్ శనివారం సేకరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ప్రజల సలహాలు, అభిప్రాయాలు, వారి భాగస్వామ్యం చేసి మేనిఫెస్టోను స్వీకరించారు. చీటిలను రాష్ట్ర పార్టీకి పంపించి ఆ తర్వాత మేనిఫెస్టో ప్రకటిస్తారని పేర్కొన్నారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దుసముడి మహేష్‌గౌడ్, సాయికిరణ్, మురళి, రమేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రజాభిప్రాయాలు సేకరిస్తున్న సుమన్‌కుమార్